# అతను

**— శ్రీ సత్య**

"అయ్యా...

బాబూ ..

రెండురోజుల్నించి అన్నంలేదు నాయనా,

ఒక అయిదు పైస లిప్పించండి బాబుగారు?"

నూతిలోంచి వస్తున్నట్టున్నాయిమాటలు.

ఆ కళ్ళల్లో ఆశ –

కడుపులో ఆకలి –

అందరి మొహాలకేసి చేతులకేసి చూస్తున్నాడు ఆశతో

అతని ఆశ తీరటం లేదు

అతని మాట ఎవరూ వినిపించుకోవటం లేదు

వినిపించినా వినిపించనట్టు –

తప్పించుకు పోతున్నారు హోటల్లోకి.

ఆవురావురు మంటూ తింటున్నారు

బయటికొచ్చి వెళ్ళిపోతున్నారు – ఎవరి దోవన వాళ్ళు.

ఉన్నట్టుండి ఆగిపోయాయతని అరుపులు.

కానీ –

ప్లేట్ల గరిగరలు –

స్పూన్ల టకటకలు –

గ్లాసుల గలగలలు –

'నాణేల ఖంగ్' మన్న శబ్దాలు –

సిగరెట్ పేకెట్ల ఆర్డర్లు –

పక్కవాడి పొట్లం కోసం అరుపులు –

మాత్రం యథాప్రకారం

*

ఉన్నట్టుండి సంచలనం జనంలో –

"జేబు కొడతావురా రాస్కెల్!"

తంతుందో టెర్ లాన్, పాయింటెడ్ బూట్లతో –

నాగరికతకు మట్టంటకుండా.

చుట్టు చేరుతున్నారు –

అంతా హడావుడి.

"ఏమిటి"

"జేబు కొట్టాడు."

జనంలో ఆసక్తి –

తొంగి చూస్తున్నారు

ఆశ్చర్యం కొందరిలో –

కోపం మరికొందరిలో –

భావి భారత పౌరుడిలా చెడ్డ దారిలో పడ్డందుకు.

అందరు కలసి –

కొడుతున్నారు –

తంతున్నారు –

చెంపలు వాయిస్తున్నారు –

చెయ్యి మెలేసి గుద్దుతున్నారు –

బాధ భరించలేక లుంగలు చుట్టుకపోతుందా ఎముకల గూడు.

* * *

"అవ్వన్నీ వేషాలండీ!"

ఓ పెద్దమనిషి వ్యాఖ్య!

మొత్తానికి అంతా కలిసి అతన్ని శిక్షించారు

ఎవరి దోవన వాళ్ళు –

దుష్టశిక్షణ చేశామన్న సంతృప్తితో.

హిప్‌పాకెట్లోంచి షోగ్గా తొంగిచూస్తున్న పది రూపాయల నోటు అడుగు జేబులోకి జారింది భద్రంగా.

వెళ్ళిపోయింది బెల్ బాటం.
మళ్ళీ యధాప్రకారం —
ప్లేట్ల గరిగరలు —
స్పూన్ల టకిటకలు —
.......... ........

* * *

"దొంగనాయాళ్ళు !"
కడుపులో ఆకలి —
కళ్ళల్లో కసి —
కలిపి తిట్టాడు అందర్నీ
మెట్ల పక్కన ముసలి బిచ్చగాని ఎండు
పెదవులు —
నవ్వాయి చిద్విలాసంగా లోకం ఇంతే
నన్నట్లు.

•

"రెండు జర్దా కిళ్ళీ"
ఆర్డరిచ్చిందో సిల్కు లాల్చి
కిళ్ళీ కొట్లో రెడ్డి —
కార్తవీర్యార్జునుణ్ణి మరిపిస్తున్నాడు
అప్పటికే నోట్లో ఉన్న కిళ్ళీ తాలూకు
రసాన్ని —
తుపుక్కున ఊసింది సిల్కు లాల్చీ.
అతని పక్కన పడి —
చింది ముఖం మీద పడింది
కోపంతో చూశాయాతని కళ్ళు —
మేము మనుషులమా పశువులమా
అన్నట్లు
గారపళ్ళు గీరగా నవ్వాయి
అతని మనస్సు కుతకుతా ఉడికి పోయింది
లావాలా —
"మేం తిండి లేక చస్తుంటే
నీ కిళ్ళీలు కావాల్సొచ్చాయిట్రా ?
దొంగనాయాలా !"
మూగగా తిట్టిందతని మనస్సు —
అతనికి తిండిలేకపోతే —
మిగిలిన వాళ్ళు కిళ్ళీలు వేసుకోకుండా
ఉండాలని లేదెక్కడా —
కడుపులో ఆకలి కొద్దీ అలా అనిపించింది
అతనికి —
"విల్స్ ఫ్లాక్ సిగరెట్ పాకెట్ ఒకటి"
రెండు రూపాయల నోటును కార్తవీర్యా
ర్జునుడికి అందిస్తుందో జూలు.
"అయిదు పైసలెయ్యి మంచే లేదని
చెప్పావుగదురా !—
ఇప్పు డేడనుం దొచ్చాయిరా డబ్బులు
హిప్పీనాయాలా !"
ఒళ్ళు మండి పోతోంది జనం మీద —
"ఆకలి కాగలేక జేబు కొడితే —
అయిదు పైసలెయ్యడం చేతగాని నాయా
లంతా కలసి—

---

## ఏప్రిల్ ఫూల్స్

ఏప్రిల్ 1 వ తేదీన చాలా మంది ఏప్రిల్ ఫూల్స్ అవుతూవుంటారు. అందుకనే దీనిని ఏప్రిల్ఫూల్స్ డే అంటారు. ఒకటవతేదీన వచ్చే జోకులు అప్పుడప్పుడూ ఎలా లాభిస్తాయో ఫ్రెంచ్ పత్రిక పారిస్ మాచ్ వివరించింది. ఏప్రిల్ ఒకటవ తేదీ వార్తా పత్రికల్లో ఒకాయన ఇలా ప్రకటించాడట "దయచేసి నాకు ఓ 10 సెంట్స్ పంపించండి" అని తన ఎడ్రస్ ఇచ్చాట్ట. పాపం అనుకొని చాలామంది పది సెంట్స్ పంపారట. సాయంత్రం అయ్యేసరికి కొన్నివేల డాలర్లు పోగయ్యాయట. ఇతను చాలా పెద్ద ఎత్తున అందరినీ ఫూల్స్ చేశాడన్న మాట !

— వసంత

కొడతారా నన్ను !"

అతనిది పాయింటే.

కాని – న్యాయాన్యాయాలు విచారించే వెవరు ?

రాయి తీసుకుని గారపళ్ళు విరగ్గొట్టాలని పిస్తుంది –

పేదని అబెల్ బాటాల మీదా –

పూల చొక్కాల మీదా – పూలమాలని పిస్తుంది.

"ఒక్క నాయాల్దగ్గర కూడా పైసా లేకుండా చేస్తే –

అప్పుడు తెలుస్తుంది నాయాళ్ళకి ఆకలి సంగతి –"

అతని కతనే నిర్ణయించాడు ఆఖరికి.

కానీ – తనొక్కడు.

చుట్టూ చూశాడు –

తన లాంటోళ్ళే చాలా మంది.

ఆకలితో –

ఆశగా –

ఆసాముల ముఖాల్లోకి చూస్తూ –

కానీ –

ఎవరికి వారొక్కరు.

అందరూ కలిస్తే ???

* * *

"ఇక్కణ్ణించి లేరా దొంగనాయాలా !

అటెటైనా చావు"

గర్జించింది ప్రొప్రయిటరు ఖంఠం.

"అడ్డమైన గడ్డి పెట్టి –

ఈళ్ళకాడ డబ్బులు నూకుతున్న నీకు నే నడ్డంవస్తా కేడినాయాలా –"

మనస్సులోనే కసిగా తిట్టాడు.

కాని లేవలేదు –

కారణం ? లేవట మిష్టములేక కాదు –

లేచే శక్తిలేక –

లేవనవసరం లేకుండానే ఎగిరి రోడ్డు మీద పడ్డాడు –

ప్రొప్రయిటరు తన్నిన తన్నుకు.

పొట్ట చేత్తో పట్టుకుని గిర గిరా తిరుగుతున్నాడు బాధతో –

"అమ్మా ! అమ్మా !"

లేని అమ్మను బాధతో పదే పదే తలుచుకుంటున్నాడు –

చుట్టూ చూశాడు –

అంతా అస్పష్టంగా –

అతికినట్టుగా –

క్రమంగా ఏమీ కనిపించలేదు కళ్ళకి.

తల వాల్చేశాడు.

ఎవరో –

రోడ్డు మీద నుంచి లాగి పక్కన పడేశారు –

ట్రాఫిక్కి అడ్డం లేకుండా.

అతన్నెవరూ పట్టించుకోలేదు.

ఎవరి గోలవాళ్ళదే –

కానీ –

సెంటర్లో –

ఫౌంటెన్ మధ్యన –

నిలబడివున్న బాపూజీ మాత్రం –

అతన్నే చూస్తున్నాడు జాలితో –

